సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 27 । జనవరి । 2024

న్యూస్‌రీల్

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

● జడ్జీలు నట్టు రవీందర్, జ్యోతిర్మయి



వేములవాడ: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి నట్టు రవీందర్ పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటపోటీల విజేతలకు శుక్రవారం జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయితో కలసి బహుమతులు అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు, ప్రధాన కార్యదర్శి నక్క దివాకర్, అడ్వకేట్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్



ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సైంటిస్టు చిగురు ఆదిమలన్‌బాబా పేర్కొన్నారు. ముస్తాబాద్ జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన 8 మంది విద్యార్థులకు శుక్రవారం సిల్వర్ మెడల్స్ బహూకరించారు. కొండాపూర్‌కు చెందిన ఆదిమలన్‌బాబా ఒమన్ దేశంలో సైంటిస్టుగా పనిచేస్తున్నారని నోడల్ ఆఫీసర్ రాజిరెడ్డి పేర్కొన్నారు. కొండాపూర్, గూడెం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని సైంటిస్టుగా ఎదిగిన ఆదిమలన్‌బాబా ఆదర్శంగా విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలని కోరారు. ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో టాపర్లకు ఆదిమలన్‌బాబా తండ్రి చిగురు లక్ష్మణ్ జ్ఞాపకార్థం సిల్వర్‌మెడల్స్ అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, చిగురు వెంకన్న, సర్వర్, గజ్జెల రాజు, శ్రీధర్‌రెడ్డి, మనోహర్, నరేశ్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని చదవాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ



వేములవాడ: రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చదువులతోపాటు రాజ్యాంగం, మన హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

ముస్తాబాద్‌కు చేరిన మల్లన్నసాగర్ నీరు

● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



ముస్తాబాద్(సిరిసిల్ల): సిరిసిల్ల ప్రాంత రైతుల యాసంగి సాగునీటికి మల్లన్నసాగర్ నీటిని తరలించామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మద్దికుంట, చీకోడులకు మల్లన్నసాగర్ ప్రాజెక్టు గోదావరి నీరు శుక్రవారం చేరిన సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడారు. పది రోజుల క్రితం భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ నీటిని విడుదల చేయాలని కోరగా.. వెంటనే స్పందించారని తెలిపారు. రాజక్కపేట, మోహినికుంట, మద్దికుంట, చీకోడుల మీదుగా ముస్తాబాద్ పెద్దచెరువుకు నీటిని తరలించినట్లు తెలిపారు. మండలంలో 9 చెరువులు నింపి యాసంగిలో పూర్తిస్థాయిలో నీటిని అందిస్తామన్నారు.

మిడ్‌మానేరుకు ఎస్సారెస్పీ జలాలు

బోయినపల్లి(చొప్పదండి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి మిడ్‌మానేరులోకి శుక్రవారం నీటి విడుదల చేశారు. వరదకాల్వ ద్వారా 2,178 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు ఒక్క గేటు ద్వారా ఎల్‌ఎండీకి 500, కుడికాల్వ ద్వారా 300, ఎడమకాల్వ ద్వారా 10 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం మిడ్‌మానేరులో 15.95 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి



జెండా వందనం చేస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి



జెండా వందనం చేస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్



వేడుకలకు హాజరైన జిల్లా అధికారులు, నాయకులు



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్లు





గాంధీజీ విగ్రహం వద్ద సిరిసిల్ల మున్సిపల్ పాలకవర్గం



ముస్తాబాద్‌లో భారీ జాతీయజెండాతో విద్యార్థులు

అన్నిరంగాల్లో అగ్రగామి

- ధార్మిక, కార్మిక, కర్షకక్షేత్రంగా అభివృద్ధి
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో 80 శాతం ప్రసవాలు
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ అనురాగ్ జయంతి
- కనులపండువగా వేడుకలు



పోలీస్ గౌరవ వందనం

సిరిసిల్ల: ధార్మిక, కార్మిక, కర్షక క్షేత్రంగా జిల్లా అభివృద్ధి చెందుతోందని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం 75వ గణతంత్ర వేడుకలు కనుల పండువగా జరిగాయి. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడారు. ప్రపంచంలోనే గొప్ప ప్రజాస్వామ్య దేశంగా నిలుపుకునేందుకు భారతరత్న అంబేడ్కర్ సారథ్యంలో రాజ్యాంగం 1950, జనవరి 26న అమలులోకి తెచ్చుకున్నామన్నారు. దేశ స్వాతంత్ర్య అమరవీరులకు, రాజ్యాంగం రూపొందించిన రాజ్యాంగకర్తలకు జోహార్లు అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు ప్రణాళికలను సిద్ధం చేస్తుందని తెలిపారు. ప్రజాప్రభుత్వం కొలువైన నెల రోజుల్లోపే 'అభయ హస్తం' ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం డిసెంబరు 9న ప్రారంభించగా ఇప్పటి వరకు జిల్లాలో 20.05 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించినట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద వైద్య సహాయాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలలకు పెంచినట్లు గుర్తు చేశారు.

రైతు భరోసా అమలు

మహాలక్ష్మీ పథకం పేరుతో మహిళలకు ప్రతీ నెలా రూ.2,500 ఆర్థిక సహాయం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసాలో రైతులకు, కౌలురైతులకు ఎకరాకు రూ.15వేల పెట్టుబడి సాయం, వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేలు, గృహజ్యోతి పథకంలో నెలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం, అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం పంపిణీ, చేయూతలో వయోవృద్ధులు, వితంతువులు, చేనేత కార్మికులు, డయాలసిస్, ఎయిడ్స్, ఫైలేరియా బాధితులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, బీడీ టేకేదారులలో అర్హులకు రూ.4వేల పెన్షన్, దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్, యువ వికాసం కింద విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డును అందించనున్నామని వివరించారు. ప్రజాపాలనలో 1,92,544 అర్జీలు రాగా.. వాటిని కంప్యూటరీకరించినట్లు తెలిపారు. ఓటరు చైతన్య కార్యక్రమాలు ప్రభావవంతంగా నిర్వహించడంతో సిరిసిల్ల నియోజకవర్గంలో 77 శాతం, వేములవాడ నియోజకవర్గంలో 78.42 శాతం ఓటింగ్ నమోదైనట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో 80 శాతం ప్రసవాలు

జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రితోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంస్థాగత ప్రసవాలు 80 శాతం జరిగాయి. 'మిషన్-80' పైలట్ ప్రాజెక్టుగా చేపట్టినట్లు తెలిపారు. గతేడాది ఫిబ్రవరిలో 54 శాతం ఉన్న ప్రసవాలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది కృషితో డిసెంబర్-2023 వరకు 80శాతం లక్ష్యాన్ని చేరుకుందని వివరించారు. సత్వర వైద్యసేవలకు 'మాతృసేవా' అమలు చేస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీలలో ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. వేములవాడ ఏరియా ఆస్పత్రి పని తీరుకు గుర్తింపుగా రెండేళ్లుగా కాయకల్ప అవార్డు, మరో 7 పీహెచ్‌సీలకు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ లభించినట్లు తెలిపారు.

పల్లెల సమగ్రాభివృద్ధి

పల్లెల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పరిశుభ్రత, పచ్చదనం పెంపునకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 సర్వేలో జిల్లాకు 5 స్టార్ రేటింగ్ లభించిందని, ఇదే స్ఫూర్తితో ముందుకెళ్తే పల్లెల్లో పచ్చదనం పెరగడంతోపాటు ప్రజా ఆరోగ్యం బాగుపడుతుందన్నారు.

సిరిసిల్ల, వేములవాడ పట్టణాల అభివృద్ధికి..

కార్మిక క్షేత్రం సిరిసిల్ల, ధార్మిక పట్టణం వేములవాడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా వేములవాడను తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతుందని, సిరిసిల్ల పట్టణం ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్‌గా గుర్తింపు దక్కించుకుందన్నారు. మహాశివరాత్రికి వేములవాడకు వచ్చే భక్తులు మెచ్చేలా వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. పారదర్శకంగా ప్రజావాణి అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణ

శాంతి సామరస్యం వెల్లివిరిసిన సమాజంలో మాత్రమే వికాసం సాధ్యమన్నారు. ఈక్రమంలోనే శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం ముందుకు సాగుతోందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మార్గదర్శనంలో జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. జిల్లా అభివృద్ధికి సహకారం అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలకు విచ్చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, కుటుంబ సభ్యులకు ప్రత్యేక ప్రణామాలు చెప్పారు.

పోలీస్ గౌరవ వందనం

జాతీయ జెండాను ఆవిష్కరణ తర్వాత కలెక్టర్ పోలీస్‌గౌరవ వందనం స్వీకరించారు. అంతకు ముందు ఎస్పీ అఖిల్‌మహాజన్‌కు పోలీసులు గౌరవ వందనం చేశారు. అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఎస్.ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు నాగేంద్రచారి, రవికుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టర్ అనురాగ్ జయంతి తన క్యాంపు ఆఫీస్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు బహూకరించారు.



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యప్రదర్శన



గంభీరావుపేటలో విద్యార్థుల ప్రదర్శన



రాజన్న ఆలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న అధికారులు



జిల్లా కోర్టులో జెండా వందనం చేస్తున్న జడ్జీలు



మన రాజ్యాంగం ఉన్నతమైనది



జిల్లా గ్రంథాలయంలో అడిషనల్ కలెక్టర్



మున్సిపల్ ఆఫీస్‌లో జెండా ఆవిష్కరణ

● అడిషనల్ కలెక్టర్ పూజారి గౌతమి

సిరిసిల్ల: ప్రపంచంలోనే మన రాజ్యాంగం ఉన్నతమైందని జిల్లా అదనపు కలెక్టర్ పూజారి గౌతమి పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా గ్రంథాలయసంస్థ వద్ద శుక్రవారం జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు రాజ్యాంగ విలువలకు కట్టుబడి, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావంతో జీవించాలని సూచించారు. గ్రంథపాలకులు కమటం మల్లయ్య, మాధవి, గ్రంథాలయ సిబ్బంది సాయి, మహేశ్ పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం గణతంత్ర వేడుకలు మిన్నంటాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, వాడవాడల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అధికారులు వారి కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. జిల్లా పరిషత్ కార్యాలయం, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుల్లో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, స్థానిక జిల్లా కోర్టులో జడ్జి ప్రేమలత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మండల న్యాయసేవాసమితి సభ్యుడు చింతోజు భాస్కర్, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు. సెస్ ఆఫీస్‌లో చైర్మన్ చిక్కాల రామారావు జెండా ఎగురవేశారు. డీఈవో రమేశ్, డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు, డీటీవో కొండల్‌రావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళీధర్‌రావు, మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్, ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ జాతీయ జెండాలు ఎగురవేశారు.

బెటాలియన్‌లో జెండా ఆవిష్కరణ

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ శ్రీనివాసరావు జాతీయ జెండాను ఎగురవేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వచ్చిన పతకాలను అధికారులకు అలంకరించారు. ప్రతిభ చూపిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు.

శివదీక్షలు షురూ..



వేములవాడ: మహాశివరాత్రి జాతర మహోత్సవాలు సమీపిస్తుండడంతో ఏటా చేపట్టే శివదీక్షలు శుక్రవారం రాజన్న ఆలయంలో ప్రారంభమయ్యాయి. గురుస్వామి వాసాలమర్రి గోపి, భక్తులకు మాలధారణ గావించారు. 300 మంది మండల దీక్షలు స్వీకరించారు.

హలో.. హలో.. రెస్పాండ్



వేములవాడ: హలో.. హలో.. రెస్పాండ్.. అంటూ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అధికారులు శుక్రవారం వాకీటాకీల ద్వారా భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. సమ్మక్క జాతర నేపథ్యంలో వేలాదిగా తరలివస్తున్న భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు సమీక్షించారు. 19 వాకీటాకీలతో రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు.

జిల్లా అభివృద్ధికి పెద్దపీట



చందుర్తిలో జెండా ఆవిష్కరిస్తున్న విప్ శ్రీనివాస్

సిరిసిల్లటౌన్/చందుర్తి(వేములవాడ): కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముందుకుసాగుతోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం, చందుర్తిలో శుక్రవారం జెండా ఆవిష్కరణ అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేశామన్నారు. రానున్న రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. యువత సరైన మార్గంలో వెళ్తే దేశ ప్రగతి సాధ్యమవుతోందన్నారు. యువకులు హక్కులతోపాటు బాధ్యతలు గుర్తు పెట్టుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ నాయకులు చింతపంటి రామస్వామి, పులి సత్తయ్య, గొట్టె ప్రభాకర్, దారం చంద్రం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల అంబాసిడర్‌గా ఎదగాలి

సిరిసిల్ల ఎడ్యుకేషన్: పవర్‌లూమ్ క్లాత్ ఫోల్డింగ్ మిషన్‌ను తయారు చేసిన హేమంత్ సిరిసిల్ల అంబాసిడర్‌గా ఎదగాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆకాంక్షించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ విప్ శ్రీనివాస్, హేమంత్‌ను శాలువాతో సన్మానించారు. భవిష్యత్‌లో వినూత్న ఆలోచనలు, పరిశోధనలకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. సిరిసిల్లలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి స్థితిగతులు తెలుసుకున్నారు. పాఠశాల స్టాఫ్ సెక్రెటరీ మల్లారపు పురుషోత్తం, సైన్స్ టీచర్ శంకర్, హేమంత్ కుటుంబ సభ్యులు జక్కని సుధాకర్, రామకృష్ణ, నరేశ్ పాల్గొన్నారు.



క్లుప్తంగా

అంతర్‌జిల్లా దొంగల అరెస్టు

● రూ.40 వేలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

గంభీరావుపేట(సిరిసిల్ల): దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు అంతర్‌జిల్లా దొంగలను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్‌రెడ్డి, గంభీరావుపేట ఎస్సై రాంమోహన్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అరెస్టు వివరాలను వెల్లడించారు. గంభీరావుపేట మండల పరిధిలోని ముస్తఫానగర్, దమ్మన్నపేటల్లోని ఐడియా, బీఎస్‌ఎన్‌ఎల్ సెల్‌టవర్స్‌లోని బ్యాటరీలు చోరీకి గురయ్యాయని డిసెంబర్‌లో వచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఐదుగురిని పట్టుకొని, రూ.40వేలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కామారెడ్డి జిల్లాకు చెందిన అరుణ్‌కుమార్, రవి, మైసయ్య, లింగం, కలీం అహ్మద్‌లను పెద్దమ్మ అటవీ ప్రాంతంలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. నిందితులు గతంలో బాన్సువాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడినట్లు వివరించారు.

రక్తదానం చేయడం పౌరుల బాధ్యత

● డీటీవో కొండల్‌రావు



శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

సిరిసిల్లటౌన్: రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని జిల్లా రవాణాశాఖ అధికారి కొండల్‌రావు అన్నారు. సిరిసిల్లలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రక్తదానం చేయడం పౌరుల కనీస బాధ్యతని పేర్కొన్నారు. 82మంది యువకులు రక్తదానం చేయగా వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎంవీఐ కిశోర్ చంద్ర, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు గుడ్ల రవి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రేపు బీఆర్‌ఎస్ సర్వసభ్య సమావేశం

● పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య



మాట్లాడుతున్న ఆగయ్య

సిరిసిల్లటౌన్: బీఆర్‌ఎస్ జిల్లా సర్వసభ్య సమావేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కె.తారకరామారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తెలిపారు. ఈమేరకు శుక్రవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. గ్రామస్థాయి, మండలస్థాయి వరకు అన్ని కమిటీల సభ్యులు, క్రియాశీల సభ్యులు హాజరయ్యేలా చూడాలని పార్టీ నేతలను కోరారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలపై కేటీఆర్ దిశానిర్దేశం చేస్తారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తములకు ప్రశంసాపత్రాలు



అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు ప్రశంసాపత్రం ఇస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో ఉత్తమ సేవలందించిన వివిధ శాఖల అధికారులు 153 మందికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ప్రశంసాపత్రాలు అందించారు. సిరిసిల్ల క్రైం: విధి నిర్వహణలో నిబద్ధతతో పని చేస్తే గుర్తింపు అదే వస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా డీపీవోలో జాతీయ జెండా ఎగురవేశారు. ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి, ఏఎస్పీ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆనంద్‌కుమార్, ఆర్డీవో, సిరిసిల్ల | మధుసూదన్, ఆర్డీవో, వేములవాడ | రవీందర్, డీపీవో | గంగయ్య, ఎస్‌డీసీ | శ్రీనివాస్, డీఆర్‌డీవో | లక్ష్మీరాజం, డీడబ్ల్యూవో | దశరథం, డీపీఆర్వో



శ్రీనివాసాచారి, సీపీవో | సాగర్, జౌళిశాఖ ఏడీ | రఫీ, లేబర్ ఆఫీసర్ | శ్రీకాంత్, కలెక్టర్ సీసీ | నాగరాజు, కలెక్టర్ సీసీ | రమణ, అడిషనల్ కలెక్టర్ సీసీ | నాగేంద్రచారి, డీఎస్పీ, వేములవాడ



రాంరెడ్డి, కలెక్టరేట్ ఏవో | షరీఫ్ మొహియొద్దీన్, తహసీల్దార్ | చంద్రయ్య, ఏఎస్పీ, సిరిసిల్ల | రవికుమార్, ఎస్టీ డీఎస్పీ, సిరిసిల్ల | పాపారావు, ఏపీవో, డీఆర్‌డీఏ | అబ్దుల్ రశీద్, ఎస్టీవో, సిరిసిల్ల | డా.సంతోష్ కుమార్, సిరిసిల్ల



శ్రీకాంత్, ఎస్సై | సీఐ రఘుపతి, సిరిసిల్ల పట్టణం | ఆర్‌ఐ అడ్మిన్ యాదగిరి | పృథ్వీధర్‌గౌడ్, ఎస్సై | మదన్‌మోహన్ (ఏడీఆర్‌డీవో) | చిరంజీవి, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట | వెంకటేశం, ఫొటో గ్రాఫర్ డీపీఆర్వో | షబ్బీర్ అహ్మద్, ఏఆర్ ఎస్సై | శ్రీనివాస్, ఏఎస్సై, కోనరావుపేట | రాజేందర్, పీసీ, గంభీరావుపేట | రాజు, ఏఆర్ హెచ్‌సీ | లక్ష్మీనారాయణ, ఏఆర్ హెచ్‌సీ

నిష్పాక్షిక కవిత్వమే శాశ్వతం

● కవి సమ్మేళనంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్

సిరిసిల్లకల్చరల్: రాజకీయాలకు అతీతంగా సమకాలీన సమాజంలోని రుగ్మతలను నిష్పాక్షికంగా వెలుగులోకి తెచ్చిన కవిత్వమే శాశ్వతమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కేంద్ర కవి సమ్మేళనం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. తెలంగాణ సాధనతోపాటు అనేక ప్రజా ఉద్యమాలకు తమ కవిత్వంతో ఊపిరిలూదిన కవులు, రచయితలు మార్గదర్శకులని పేర్కొన్నారు. పరిపాలన గతి తప్పకుండా, ప్రజా శ్రేయస్సును విస్మరించకుండా కవులు ముందుచూపుతో దిశానిర్దేశం చేయాలని సూచించారు. కాంగ్రెస్ సీనియర్ నేత కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దశాబ్ద కాలంపాటు సాగిన అరాచక పాలన, ప్రజాక్షేత్రంలో పలు రకాల సమస్యలను ఎత్తి చూపాల్సిన బాధ్యతను తెలంగాణ రచయితల వేదిక తలకెత్తుకుందని అభినందించారు. అనంతరం ఎంపిక చేసిన సుమారు 20 మంది కవులు తమ కవితాగానాన్ని వినిపించారు. వేదిక జాతీయ అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, జిల్లా బాధ్యులు వెంగల నాగరాజు, ఆడెపు లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకుడు నాగుల సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘం నేత పాకాల శంకర్‌గౌడ్, వీరగోని చైతన్య తదితరులు మాట్లాడారు. వెంగల లక్ష్మణ్, బూర దేవానందం, శివాల భక్తియార్, తిగుళ్ల శ్రీకాంత్ శర్మ, శోభారాణి, అనిత, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

చెట్లపొదలు.. పాముల సంచారం

● స్కూల్ ఆవరణలో నర్సరీ
● భయంభయంగా ఉంటున్న విద్యార్థులు
● శుక్రవారం ఓ కొండచిలువను హతమార్చిన గ్రామస్తులు
● నర్సరీని తరలించాలంటున్న తల్లిదండ్రులు



కొండచిలువను పరిశీలిస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులు నిత్యం వచ్చిపోయే పాఠశాల సమీపంలో నర్సరీని ఏర్పాటు చేయడం వారికి ఇబ్బందులను తెచ్చిపెట్టింది. చెట్లు, పొదలు విపరీతంగా పెరగడంతో ఇటీవల పాముల సంచారం పెరిగింది. నిత్యం పాములు కనిపిస్తుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. నర్సరీని తరలించాలని కోరుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం ఓ కొండచిలువను గ్రామ భజరంగ్ యూత్ సభ్యులు హతమార్చారు. అప్పటి వరకు స్కూల్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొని, అదే సమయంలో విద్యార్థులు ఇళ్లకు వెళ్లారు. ఒకవేళ గ్రామస్తులు కొండచిలువను గమనించకపోయి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.

5 తరగతులు.. 26 మంది విద్యార్థులు

అగ్రహారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఐదు తరగతులలో 26 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. స్కూల్ ఆవరణలో నర్సరీ వద్దని మండల అధికారులకు విద్యార్థుల తల్లిదండ్రులు గతంలో పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఎస్‌ఎంసీ చైర్మన్ మామిండ్ల కిషన్ తెలిపారు. నెల రోజుల క్రితం ఓ నాగుపాము తరగతిగది సమీపంలోకి రాగా విద్యార్థులు చూడడంతో గ్రామస్తులు వచ్చి చంపేశారని తెలిపారు. శుక్రవారం జెండా వందనం ముగించుకొని విద్యార్థులు ఇళ్లకు వెళ్లిన తర్వాత కొండ చిలువ వచ్చినట్లు చెప్పారు. నర్సరీతో పాములు, తేళ్లు వస్తున్నాయని వెంటనే నర్సరీని తరలించాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆలనాపాలన చూసే తల్లి మృతి

● తండ్రికి అనారోగ్యం
● దిక్కుతోచని స్థితిలో దివ్యాంగ కుమారుడు




గౌరవ్వ (ఫైల్), రాములు, ఆంజనేయులు

కోనరావుపేట(వేములవాడ): ఆ యువకుడు దివ్యాంగుడు.. తండ్రికి అనారోగ్యం.. ఏ పనికీ వెళ్లలేరు.. దీంతో తల్లే కూలీ పని చేస్తూ ఇద్దరి ఆలనాపాలన చూసేది. హఠాత్తుగా ఆమె చనిపోవడంతో వారు దీనంగా చూస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండలంలోని కొలనూర్ గ్రామానికి చెందిన మేర్గు గౌరవ్వ–రాములు దంపతులకు కుమారుడు ఆంజనేయులు ఉన్నాడు. అతను దివ్యాంగుడు. రాములు కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఇద్దరూ ఏ పనీ చేయలేరు. దీంతో గౌరవ్వ కూలీ పనులకు వెళ్తూ వారిని చూసుకునేది. గురువారం రాత్రి గుండెపోటు రావడంతో మృతిచెందింది. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ తండ్రీకుమారుడిని చూసి స్థానికులు కంటతడి పెట్టారు. వారిని దాతలు ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

మేడారం భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి

● కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రఘునాథ్‌రావు



మాట్లాడుతున్న అధికారులు

కరీంనగర్: మేడారం జాతరకు వెళ్లే ప్రయాణికులకు కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రఘునాథ్‌రావు సూచించారు. మేడారం మహాజాతర ఫిబ్రవరి 18 నుంచి 25 వరకు జరుగనున్న నేపథ్యంలో 11 డిపోలకు చెందిన డీఎంలు, మెకానిక్ సూపర్‌వైజర్లతో శుక్రవారం బస్‌స్టేషన్ కాంప్లెక్స్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ అధికారులు ఎక్కడికక్కడ సమన్వయంతో ముందుకు సాగాలని దిశానిర్దేశనం చేశారు. వనదేవతల జాతరకు లక్షలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా రవాణా సౌకర్యం, భక్తులకు విడిది, ఇతరత్రా ఏర్పాట్లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఆర్‌ఎం సుచరిత, వివిధ విభాగాల అధికారులు సుగుణాకర్, భూపతిరెడ్డి, కె.సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఎం.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకముందు ఆర్టీసీ ఈడీ రఘునాథరావు కరీంనగర్ బస్‌స్టేషన్‌లో బస్సులను, ప్రయాణికుల రాకపోకలను పరిశీలించారు.

వాహనదారులూ.. కెమెరా ఉందిక్కడ



షర్టుకు కెమెరా పెట్టుకొని, విధుల్లో ఎస్సై రాజు

● దురుసుగా ప్రవర్తిస్తే రికార్డవుతుంది
● తమపై ఫిర్యాదులు వెళ్తున్నాయని ట్రాఫిక్ ఎస్సై కొత్త ప్రయత్నం

సిరిసిల్లక్రైం: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాన్ని నడుపరాదని, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ పార్కింగ్, మైనర్ డ్రైవింగ్, వాహనాల ధ్రువపత్రాల తనిఖీ ఇలా.. నిత్యం రోడ్డుమీద ఉండి, విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులకు చెప్పలేనన్ని ఇబ్బందులు. అంతేకాదు, వాహనదారులు తమను తిట్టారని, నెట్టివేశారని ట్రాఫిక్ పోలీసులు, వారిపై వాహనదారులు ఉన్నతాధికారులకు చేసే ఫిర్యాదులు. ట్రాఫిక్‌లో తిప్పలు పడి, పని చేసిన తమకు చీవాట్లు తప్పడం లేదని, వాటి నుంచి ఉపశమనం పొందాలని సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్సై రాజు కొత్త ప్రయత్నం చేశారు. తాను విధులు నిర్వహించే సమయంలో ఎదుటివాళ్ల తీరును సీసీ కెమెరాలో నిక్షిప్తం చేసుకునేలా తన షర్టుకు 360 డిగ్రీలు కవర్ చేసే కెమెరా అమర్చుకున్నారు. ఇక వాహనాల తనిఖీ, డ్రంకెన్‌డ్రైవ్ పరీక్ష చేసేటప్పుడు వాహనదారులు చేసే హంగామా, తాను చేసే కౌన్సెలింగ్ అంతా రికార్డవుతుందని, ఏదేని ఫిర్యాదు వస్తే కెమెరాలో వీడియోను చూస్తే నిజాలు తెలుస్తాయని 'సాక్షి'కి తెలిపారు. గతంలో అనేకసార్లు వాహనదారులు విధుల్లో ఉన్న తమపై గొడవకు దిగడం, దాన్ని ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్లడంతో ఇలాంటి ఆలోచన చేసినట్లు చెప్పుకొచ్చారు.





సిరిసిల్ల కొత్త చెరువు మినీ ట్యాంక్‌బండ్ పార్క్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు



విద్యార్థినులకు జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి



బహుమతి ప్రదానం చేస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

అంబరాన గణతంత్ర సంబరం

సిరిసిల్ల కల్చరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం జిల్లా అధికార యంత్రాంగం పర్యవేక్షణలో నిర్వహించిన సాంస్కృతిక సంబరాలు అంబరాన్నంటాయి. సిరిసిల్ల కొత్త చెరువు మినీ ట్యాంక్‌బండ్ పార్క్‌లో జరిపిన వేడుకలను జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రారంభించారు. పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. సరస్వతీ శిశుమందిర్, రెయిన్‌బో, జెడ్పీహెచ్‌ఎస్ శివనగర్, టీఎస్ డబ్ల్యూఆర్‌ఎస్ బద్దెనపల్లి, కేజీబీవీ వేములవాడ, జెడ్పీహెచ్‌ఎస్ వీర్నపల్లి, సెలెస్టియల్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పలు దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటే సాంస్కృతిక కళారూపాలను ప్రదర్శించారు. సంప్రదాయ, జానపద కళారూపాలతో ఆకట్టుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు కలెక్టర్ జ్ఞాపికలు అందజేశారు.

ఆకట్టుకున్న మిల్లెట్ మేళా

ఆధునిక కాలానికి తృణధాన్యాల ఆవశ్యకతను చాటుతూ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ మేళా ఆకట్టుకుంది. సకినాలు, గారెలు, రాగి లడ్డూలు, బబ్బెర గుడాలు తదితర తెలంగాణ సంప్రదాయ వంటకాలను తృణధాన్యాలతో తయారు చేసి, ప్రదర్శించారు. కలెక్టర్, అధికారులు సందర్శించి, పరిశీలించారు. ఐసీడీఎస్‌లో ఉత్తమ ఉద్యోగులను అభినందించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, ట్రైనీ ఎస్పీ రాహుల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజం, ఆర్డీవో ఆనంద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అయాజ్, కౌన్సిలర్లు దార్నం అరుణ, రాపెల్లి అరుణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన అతిథులు



స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి